కదలే నీడలు

"చీకటి" అన్నాడతను.

"అవును" అంది ఆమె.

ఇద్దరూ రోడ్డు మలుపు తిరిగారు. ఇప్పుడు వచ్చినరోడ్డు మరీ పెద్దదిగావుంది. ఇరువైపులా ఉన్న మేడల వరుసలు ఆ నిశ్శబ్దంలో చీకటిలో ఆలోచనలులేని స్తబ్దమనస్సుల్లా ఉన్నాయి. మధ్య మధ్య వలయంగా నీడలు కల్పిస్తూ, బ్లాకౌట్ చేయబడిన విద్యుద్దీపాలు నగరపు మెల్లకన్నులు లావున్నాయి. అక్కడక్కడ షెల్టర్లూ, సగం సగం తియ్యబడిన గోతులూ, కంకర గుట్టలూ ఉన్నాయి. ఏదో ప్రమాదాన్ని పసికట్టినట్టు గాలి స్తంభించిపోయింది.

"ఇలా ఎక్కడికి?" అంది ఆమె. తలపైకి ఎత్తినపుడు చెవి లోలకు మెరిసింది.

"ఎక్కడికేఁవిటీ" అన్నాడతను. అతను తన చేతిని జేబులోనికి పోనిచ్చి తిరిగి తీసివేశాడు.

"ఒక్కొక్కసారి చీకటికూడా బావుంటుంది." అన్నాడు.

"అవును" అందామె.

"చీకట్లో ఏమీ కనపడవు" అతనన్నాడు ఏదోతృప్తిగా.

"ఊహూ - మరీ స్పష్టంగా కనపడతాయి. భయపెడతాయి" అందామె ఆలోచనగా.

"ఏమిటి?"

"మన ఊహలు....మన బాధలు...."

అతను దగ్గాడు. ఈ మాటలు యిష్టంలేదన్నట్టు చటుక్కున ప్రసంగం మార్చాడు.

"కలకత్తా చాలా పెద్ద పట్టణం" అన్నాడు. జేబులోకి చేతిని పోనిచ్చి తీసివేశాడు. ఆమె ఏం మాట్లాడలేదు.

"మీరు చదువుకున్నారా! అంటే కాలేజీలో."

"ఆఁ"

"మీ ఆయన ఏం చదివాడు."

"నాలాగే బి. యే."

"మిమ్మల్ని వదలి ఎలా వెళ్ళిపోయాడు?" అతను మరొకవైపు చూస్తూ అడిగాడు.

"లేకపోతే ఏం చెయ్యమంటారు?"

"మీకు బాధగా లేదూ!"

ఆమె నీరసంగా నవ్వి "ఎందుకుండాలి?" అంది.

"అంతే అంతే" అన్నాడతను. దేనికోసమో జేబులో చెయ్యిపెట్టి తీసివేశాడు.

"ఈ రోడ్డు చాలా పొడుగు" ఏం తోచక అన్నాడతను.

"అవును."

పెద్ద లైట్లతో ఒక కారు వచ్చి వాళ్ళని దూసుకుపోయింద.

ఆమె తప్పుకుంటూ అతనికి తగిలింది. మళ్ళీ చటుక్కున దూరంగా తప్పుకుంది.

"పొగరు" అంది ఆమె.

"లారీ మిలటరీవాళ్ళది."

"యుద్ధం వస్తుందా?"

అతను నవ్వాడు. "రావడమేఁవిటి? ప్రచండంగా జరుగుతూంటే."

"కాదు. మన దేశానికి కూడ?" అంది ఆమె.

"ఏమో."

ఒక మిణుగురు ఆమె ముంగురులకి తగిలి వెళ్ళిపోయింది.

రైలు గేటుదగ్గర ఎవరూ లేరు. రెండు కుక్కలు మాత్రం పట్టాలకి కాస్త దూరంగా పడుకున్నాయి.

"మీరేం ఆలోచిస్తున్నారు?" అని అడిగాడతను, గేటు దాటి కొంచెం దూరం వెళ్ళాక.

"ఏమిలేదు" స్వప్నంలోంచి మాట్లాడుతూన్నట్టుంది ఆమె.

"ఏం లేదూ!"

"ఏమీ లేదు" - స్ఫుటంగా కోపంగా అంది ఆమె.

అతనికి ఆశ్చర్యం వేసింది. ఏమీ లేకపోవడం అంటే? లారీలూ, షెల్టర్లూ, విమానాలూ, పత్రికలూ, హిట్లరూ, ఎ. ఆర్. పీ. ఆమె, తానూ - అన్నీ ఉండగా అందరూ ఉండగా ఏమీ లేకపోవడమేమిటి? తెలివిగా తనంతట తనే కనురెప్పల మధ్య నవ్వుకున్నాడు. ఒకసారి జేబులోకి చెయ్యిపోనిచ్చి తీసివేశాడు.

"మీ ఆయన ఎక్కడున్నాడు?" అన్నాడతను.

"ఈజిప్టులో."

"పాపం" అన్నాడతను.

"ఏం?" అంది ఆమె.

"సైన్యంలో ఎందుకు చేరాడు ?"

"ఎందుకా–" ఆమె అతనికేసి ఓ నిముషం చూసి మెల్లగా "మీ రెందుకు చేరారూ ?" అంది.

"నే నీ దేశంలోనే ఉన్నానుగా."

"అయితేనేం ?"

"ఎందుకు చేరానా ?" అతను ఆలోచిస్తూ ట్రాము బద్దీలకేసి చూశాడు. అవి సాగిసాగి ఎక్కడో చీకట్లో కలసిపోయాయి. దారిపక్క ఓ పెద్ద గోతిలోంచి రెండు పందికొక్కులు ఉత్సాహంగా యివతలకివచ్చి పరిసరాల్ని పర్యవేక్షించాయి.

"ఎందుకేఁవిటీ ?" అతను కారణాలు వెతుక్కుంటూ స్వగతంలా మాట్లాడుతున్నాడు. "ఉద్యోగమూ లేదు, డబ్బూలేదు. నా భార్యా చని పోయింది. ఏం తోచలేదు. సైన్యంలో చేరేశాను" ఇలాగ అని ఆలోచిస్తూ అతను అక్కడే నుంచునిపోయాడు.

నాలుగడుగులు ముందుకు వెళ్ళిన ఆమె వెనక్కి తిరిగి "ఆగి పోయారేం ?" అంది.

"మర్చిపోయాను" క్రాపు సవరించుకుని అతను ముందుకు సాగాడు.

"మీ భార్య ఎందుకు పోయిందీ ?" ఆమె అడిగింది.

"నన్ను ప్రేమించి."

ఆమె వింతగా అతనికేసి చూసింది. అతను కంగారుగా తల పక్కకి తిప్పుకున్నాడు.

"ఎప్పుడయింది మీ పెళ్ళి ?" అంది ఆమె.

"మేం పెళ్ళిచేసుకోలేదు."

"అంటే ?"

"పెళ్ళికి పెద్దవాళ్ళు ఒప్పుకోలేదు. మా కులాలు వేరు. ఆమె నాతో వచ్చేసింది."

"తర్వాత."

"రిజిష్టరు మారేజీ చేసుకుందామని అనుకున్నాం. కాని ఉద్యోగం కోసం ఊరూరా తిరుగుతూ నాగపూర్ వెళ్ళాం. అక్కడ సత్యాగ్రహంలో చేరాం. మమ్మల్ని జైలులో పెట్టారు. మాకు మలేరియా వచ్చింది. మమ్మల్ని వదలిపెట్టారు. నాకు మలేరియా దానంతట అదే కుదిరింది. ఆమెకు కుదరలేదు. సరైన మందులేక...." అతను గుండెల మీద చెయ్యిపెట్టి రాసుకున్నాడు. ఆమె అవ్యక్తంగా వచ్చే ఒక ఆలోచనని తల్చుకుని భయపడి "అబ్బా" అంది

"ఏం ?" అన్నాడతను.

"ఏమీలేదు" అందామె.

అతనికి తిరిగీ ఆశ్చర్యం వేసింది. తెలీని బాధ, ఒంటరితనమూ, యుద్ధమూ-ఈజిప్టూ. మలేరియా - యిన్ని వుంటే లేకపోవడం ఏమిటి ?

ఆకాశంమీద ఆర్ద్రానక్షత్రంమీద ఒక లేతమబ్బు కప్పుకొని వుంది. పక్కసందులో ఒక ఆంగ్లో - ఇండియన్ యువతీ, యువకుడూ ఒకరి మీద ఒకరు తూలుతూ నడుస్తున్నారు.

"మీరు వెల్సురాసిన 'Things to Come' చదివారా ?"

"నాకు వెల్సు అంటే అయిష్టం" అందామె.

"అందులో Walking disease వచ్చిందట యుద్ధంమూలాన్ని. మనకీ ఆ జబ్బు వచ్చిందేమో" అతను నవ్వుదామని ప్రయత్నించి దానికి బదులుగా దగ్గాడు.

"మా మేనమామ క్షయమూలాన్ని చనిపోయాడు" అందామె

"మంచిపని చేశాడు." అతను తిరిగి యిలా అన్నాడు :

"మీ రెండుకు నర్సుగా చేరారూ ?"

"ఆయన యుద్ధంలోకి వెళ్ళిపోయారు. మరి నేనేం చెయ్యను ? ఏదో దిగులుగా వుండేది. ట్యూషన్లు చెప్పమన్నారు "

"బాగానే వుంది."

"కాని చెప్పలేదు."

"ఏం ?"

"నా కసహ్యం."

"తర్వాత ?"

"నర్సుగా చేరాను ఒక హాస్పిటల్లో."

"మరి ?"

"ఒక రోగి వచ్చాడు."

"ఎవరూ ?"

"ఒకరు. ఎంతో గంభీరంగా వుండేవాడు ఎప్పుడూ జాలిగా నాకేసి చూసేవాడు. నేను లేకపోతే మందైనా తాగేవాడుకాదు."

"ఊఁ."

"అతనంటే ఏదో యిష్టం కలిగింది. పరిచర్యతో, అనురాగంతో అతని బాధను తగ్గించాలనుకునేదాన్ని. అతనిలాగా నా భర్త ఎక్కడైనా పడి ఉన్నాడేమో...."

ఆమె గొంతు రుద్ధమయినట్లనిపించింది. అతను జేబులోకి చేతిని పోనిచ్చి తీసేశాడు.

"తర్వాత ?" అన్నాడతను భయంగా.

"నర్సుపని మానేశాను."

"ఏం?"

"ఆ రోగి పోయాడు."

అతను నిట్టూర్చాడు. ఒక షెల్టరు దగ్గర ఎవడో ముష్టివాడు నిద్రలో కలవరిస్తున్నాడు. అతను మళ్ళీ అన్నాడు.

"ఇలా ఎక్కడికి నడుస్తున్నాం?"

"అగమ్యం" అంది ఆమె.

"మీకు తెలుగు బాగా వచ్చునే."

"పరీక్షలో పోయేది ఎప్పుడూ"

అతను నవ్వాడు ఏదో గౌరవార్థంగా అన్నట్టు.

"మరి...." సందేహిస్తూ ఆగాడు.

ఏమిటి అన్నట్టుగా. ఆమె అతని కేసి చూసింది.

"మరి సైన్యంలో నర్సుగా ఎందుకు చేరారు?" అన్నాడతను.

"కొన్నాళ్ళు ఈజిప్టునుండి ఉత్తరం రాలేదు. కంగారు పడ్డాను."

"అహాఁ"

"అతని భుజంలోంచి గుండు దూసుకుపోయిందని వార్త వచ్చింది."

"అరె!"—అప్రయత్నంగా ఆమె భుజంమీద చెయ్యి వేశాడు.

"మళ్ళీ నేటివరకూ ఏ వార్తా రాలేదు. బతికివున్నాడో లేదో కూడా తెలియదు,"

ఆమె నుదుటిమీద పడే ముంగురుల్ని వణకే చేత్తో సవరించుకుంది. మళ్ళీ యిలా అంది.

"అప్పట్నుండి సంక్షోభంగా ఉండేది మనస్సు. సైన్యంలో నర్సుగా చేరాను."

"ఇక్కడ శాంతిగా వుందా ?" అడిగాడతను.

"లోని కంగారుని అణచివేసోంది యీ యుద్ధసంక్షోభం. అందరి వెనుకాలా అన్ని చోట్లా మృత్యువు పొంచి ఉన్నట్టనిపిస్తుంది? యీ సోల్జర్ల మధ్య. అప్పుడు నా బాధ ఒక్కటీ విడిగా కనపడదు."

"నిజమే,"

"ఒక్కొక్కసారి యీ సోల్జర్లలో ఎక్కడో మా ఆయన ఉన్నాడేమో అనిపిస్తుంది.

బ్లాకౌట్ చేయబడిన వెలుతురులో ఆమె కళ్ళ చివర కన్నీటి బిందువుని చూశానా అని అనిపించింది అతనికి. ఏమనాలో తోచలేదు. చీకటి బావుంటుంది అన్నాడు జేబులో చెయ్యిపెట్టి తీసివేశాడు.

రోడ్డు క్రమంగా ఒక మైదానంలో కలిసిపోయినచోట అస్పష్టంగా విశాలంగా అయిపోయింది. మైదానంలో డేరాలూ, డేరాలలోంచి చిన్న చిన్న లైట్లూ కనబడుతున్నాయి. మైదానానికి యింకా దూరంగా నడుస్తూన్న అతనికీ ఆమెకీ సన్నని గొంతుక పాడుతూన్నట్టు వినిపిస్తుంది. పాట కొత్తగా విజాతీయంగా వుంది. ఎవరో తనలో తాను ఏడుస్తూ నవ్వుతూ కిందపడి దొర్లుతూన్నట్టుగా ఉంది.

"ఏమిటదీ" అంది ఆమె.

"బర్మా శరణార్థుల క్యాంపు."

"వెళదామా."

"ఊఁ."

ఇద్దరూ ఆ డేరాలవైపు నడవసాగారు. అంత రాత్రివేళకూడా కొందరు నిద్రలేకండా డేరాలకి దూరంగా కూర్చుని ఉన్నారు. కొన్ని చోట్ల ఒక స్త్రీ, పురుషుడూన్నూ, మెల్లగా భయంగా వీచే గాలిలోంచి వాళ్ళ గుసగుసలు వినపడుతున్నాయి. డేరా సందుల్లోంచి వెలుగు సన్నగా పాకి యిసుకమీదపడి మెరుస్తూంది.

"ఈ జంటలు భార్యా భర్తలా" అడిగిందామె.

"అవొచ్చును. ఏం చెప్పగలం" అన్నాడతను.

"ఇంతమంది యిళ్ళూ వాకిళ్ళూ వదలి వచ్చేశారు. పాపం వాళ్ళకి ఎలావుంటుందో "

"యుద్ధం–" పళ్ళు నొక్కిపెట్టి అన్నాడతను.

డేరాలు సమీపించిన కొలదీ ఆ ప్రదేశమంతా కంగాళీగా వుంది. డేరాలకి కొద్దిదూరంలో షెల్టర్లూ గోతులూ వున్నాయి. డేరాలలో పెట్టెలూ సామాన్లూ ముసలివాళ్ళూ పేర్చబడి వున్నారు. చాపలమీద స్త్రీలూ, శిశువులూ పరున్నారు.

"ఎంతమందో" అందామె.

అతను మాట్లాడలేదు. జేబులో చెయ్యిపెట్టి తీసేశాడు.

ఒక చంటిపిల్ల 'కార్' మంది — ఏడుస్తూ పక్కకి మరొకడి పక్కలోకి దొర్లింది. వాడులేచి విసుక్కుంటూ పెద్ద కేకలు వేస్తున్నాడు. ఒక వృద్ధుడులేచి పిల్ల నెత్తుకుని లాలిస్తూ ఈవలకి వచ్చాడు.

"తల్లికివ్వరాదూ పిల్లని"–అందామె యింగ్లిషులో.

వృద్ధుడు ఆమెకేసి కొంతసేపు శూన్యంగా చూశాడు. అతికష్టం మీద మాటలు పోగుచేసుకుంటూ ఇలా అన్నాడు. ఆ పిల్ల తన మనుమరాలనీ, తన కూతురు అస్సాము సరిహద్దుదగ్గర ప్రసవించి చనిపోయిందనీ—తిరిగీ యిలా అన్నాడు. "దీనికి పాలు లేవు. ఇదికూడా చచ్చిపోతే బాగుండును."

ఆమె జాలిగా చూసింది. ఇద్దర్నూ అక్కడనుండి కదిలారు.

"పాపం" అందామె.

"ఏం ?"

"జాలేసింది. కాని ఆ పిల్ల నాడులూ అవీ పైకొచ్చి అసహ్యంగా వుంది."

అతను యిసుకలో మౌనంగా నడుస్తున్నాడు. భారంగా అడుగులు వేస్తూ కొంచంవంగి నడుస్తున్నాడు. ఆమెకి ఏమయ్యాడో తెలియని తన భర్త ఏ అరేబియా యెడారిలోనో యిలాగే నడుస్తున్నాడా అనిపించింది. కంగారుగా పైటచేత్తో సవరించుకుంది.

ఎదురుగా ఒక యిరవై యేళ్ళ యువకుడూ యిరవై నాలుగేళ్ళ యువతీ వస్తున్నారు. మసక నిదరలో నడుస్తూన్నటు. ఆ యువతి వీళ్ళని నిదానించి చూసి "బామా" అని పిలిచి ఒక్క పరుగున వచ్చి హఠాత్తుగా ఆగి పకపకా నవ్వడం ప్రారంభించింది ఆమె వెనుకాలే యువకుడు కంగారుగా వచ్చాడు. ఇద్దరూ బర్మా దేశీయులు.

అతను యువకుణ్ణి ఉద్దేశించి "ఎందుకు నవ్వతుంది" అని అడిగాడు ఇంగ్లీషులో.

మిమ్మల్ని "బామా" అనుకుంది. కాని మీరు బామాకారు అన్నాడా యువకుడు.

"మీరెవరు-మీ పేరు" అన్నాడతను.

"నా పేరు యూబా, ఈమె పేరు ఆమా" శరణార్థులం" అన్నాడా యువకుడు లావుపాటి కిందపెదవి నొక్కిపట్టి. తిరిగీ ఇలా అన్నాడు. "మీరు ఎందు కిలాగ వచ్చారు. ఈ క్యాంపులో వుంటారా?"

"కాదు. మిలటరీలో పనిచేస్తున్నాను." అన్నాడతను.

బర్మా యువతి ఏదోఅంది. యూబా అనువదించి ఇలా అడిగాడు.

"ఈమె మీకేమౌతుంది"

"ఏమీకాదు" అన్నాడతను.

ఆమా నిద్రలేచి బరువు కళ్ళతోనవ్వి ఏదో అంది. యూబా "మాకూ ఏమీ తోచడంలేదు; కాస్సేపు కూర్చుని మాట్లాడుకుందామా" అన్నాడు.

నలుగురూ కొంచెందూరం నడిచి ఒకచోట కూర్చున్నారు. ఆమా ఏదో మాట్లాడుతూ పకాలున నవ్వుతోంది. ఈసారి యింతవరకూ మౌనంగాఉన్న ఆమె అడిగింది. "ఆమా మీకన్న పెద్దదిలావుంది. ఈమె మీకేమౌతుంది."

యూబా కళ్ళు కుంచించాడు. అతని చిన్న నొసలు ముడతలుపడి ఏవేవో స్మృతుల్ని దాస్తూన్నట్టుగావుంది. "బామా యీమె అన్నగారు. 'దేశద్రోహి'. జపాన్‌వాళ్ళ గూఢచారి అనే పేరుతో అతన్ని ప్రభుత్వం చంపివేసింది. కాని యీమెకింకా పాపం తెలియదు. ఎక్కడో బతికి ఉన్నాడను కుంటోంది. తర్వాత జపాన్ విమానాలు దాడిచేశాయి. ఆ దాడిలో యీమె గృహమూ, ముసలితల్లీ నాశనమై పోయారు. మా అందరితోనూ యీమె పారిపోయివచ్చింది. ఇప్పుడు...." యూబా ఒక సారి దగ్గి ఇలా అన్నాడు "ఇప్పుడు మేం భార్యాభర్తలలాగా వున్నాం."

"మీరు బర్మాలో ఏం చేసేవారు." అన్నాడతను.

యూబా మళ్ళీ ఆలోచించాడు. మళ్ళీ నొసలు కుంచించాడు. జవాబు చెప్పడమే పెద్ద పరిశ్రమలాగ ఉంది అతనికి. "కలప వర్తకం చేసే వాళ్ళం-నేనూ మా అన్నలూ."

ఆమె ఏదో అడగబోయింది. కాని అతను కళ్ళతో వారించాడు.

ఆమా అక్కడనుంచి లేచి అల్లరిగా గాలిలో ఎగిరే మిణుగురుల్ని పట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. అతను చేతిలోకి యిసుక తీసుకుని కొంచెం కొంచెం కిందపోస్తూ యిలా అన్నాడు.

"ఏదైనా ఉద్యోగం చెయ్యరాదూ."

యూబా అన్నాడు "అవును. నేను మిలటరీలో చేరదామను కుంటున్నాను."

అతను ఆమెకేసి చూచాడు. ఆమె కూర్చునే కునుకుపాటు పడు తోంది. అత నామెను తట్టి లేపాడు. ఆమె ఉలిక్కిపడి "అరె! నిద్ర వచ్చింది - చిత్రంగా" అంది.

యూబా అన్నాడు మళ్ళీ నిశ్చయంతో: "అవును. మిలటరీలోనే చేరుతాను."

"మరి ఆమా ఏమవుతుంది?" అంది ఆమె

"ఏమౌతుంది?" యూబా కాస్త దూరంలో ఉన్న ఆమాని ప్రేమగా చూశాడు. "ఏడుస్తుంది నిజమే. కాని ఈ దేరాలలో ఏ సౌకర్యమూ తిండీ లేక ఎన్నాళ్ళు వుండడం? ఊరికే ఉన్నకొంది మా వ్యాపారమూ, మా అన్నలూ మా వూరు జ్ఞాపకం వస్తారు. నేను సైన్యంలో చేరితే ఆమా యింకొక మంచివాణ్ణి స్నేహం చేసు కుంటుంది. యుద్ధం వచ్చినప్పుడు స్నేహాలెంత త్వరగా చేసుకుంటామో అంత త్వరగా తెంపుకోవాలి. అంతేనంటారా?" అన్నాడు యూబా ఇంగ్లీషులో తన ఆలోచనల నొక్కొక్కటే మెల్లగా విప్పుతూ. అతని గొంతులో కందిరీగ దూరినట్లు స్వరం విషాదంగా పలికింది.

మిణుగురులతో ఆడుతూ ఆమా దూరంగా వెళ్ళిపోయింది. అక్కడ నుండి యూబాను పిలిచింది. యూబా లేచి "ఆమె పిలుస్తోంది. నేను వెళ తాను." అని గబగబా వెళ్ళిపోయాడు. అతను లేచాడు. ఆమె లేచింది.

నిశ్శబ్దంగా యిద్దరూ ముందుకు నడచి వెళుతున్నారు. పోలీసు ఈల దూరంగా వినపడింది. తూర్పున నక్షత్రంమీద కప్పుకున్న మబ్బు పింజె పింజెలుగా విడిపోయింది. ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు. యూబా. ఆమా - యిరువురూ గాఢమైన కౌగిలిలో ఉన్నారు. ఇద్దరూ యిసుక ప్రదేశం దాటి ఎత్తుగావున్న ఒక దిబ్బదగ్గరకు వచ్చారు. అక్కడ కొన్ని తాటిచెట్లు మాత్రం ఉన్నాయి. చక్రాలూ,టాపూ లేని ఒక పాత జీప్‌కారు తుప్పుపట్టి బోర్లాపడివుంది.

"ఇలా కూర్చుందాం" అన్నాడతను.

"ఊఁ"

దిబ్బమీద యిద్దరూ కూర్చున్నారు. ఆకాశంమీద చంద్రుడు వడలిన పువ్వురేకులా ఉన్నాడు. ఇద్దరి నీడలూ వెనక్కి పొడుగ్గా సాచుకుని ఉన్నాయి.

"యూజా చిత్రమైనవాడు" అన్నాడతను.

"ఔను."

"మరి...."

ఆమె కనులు పైకెత్తి "ఏఁవిటి?" అంది.

"ఏదో చెప్పబోయి మరచిపోయాను." అన్నాడతను. జేబులోనికి చెయ్యి పోనిచ్చి తీసివేసి.

ఆమె వింతగా చూసింది. అతను నిశ్చలంగా శూన్యంలోకి చూస్తున్నాడు. తాటిచెట్టు పక్కనుండి ఒక ముంగిస పరుగెత్తుకు వెళ్ళింది. గుడ్డి వెన్నెలలో పట్టణపు మేడల కొసలు మెరుస్తున్నాయి. దూరంగా దేరాల నీడలు యిసుకలో మెత్తగా పరుచుతున్నాయి. అంతా విచిత్రమైన నిశ్శబ్దం.

అతను చటుక్కున నవ్వాడు, ఆమె కంగారుగా ముంగురులు పైకి తోసుకొని "ఏం?" అంది.

"ఏముందీ - ఎందుకో వచ్చింది ఏడుపులాంటి నవ్వు" అన్నాడు. అతను జేబులో చెయ్యిపెట్టి తీసివేశాడు. పళ్ళు పటపటా కొరుకుతూ "యుద్ధం!" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు. అతను ఆమెకేసి చూశాడు. ఆమె కళ్ళమ్మట నీటిచుక్కలు రాలుతున్నాయి. అతను తెల్లబోయాడు. జాలి అతని మొహంలో ప్రసరించింది.

"ఎందుకు ఏడుస్తున్నావు ?" అన్నాడు విసుగ్గా, జాలిగా.

ఆమె జవాబు యివ్వలేదు. అతను ఆమె దగ్గరగా జరిగి ఆమె తలనీ, చెక్కిళ్ళనీ నిమిరాడు. ఆమె వొరిగి అతని వక్షంమీద తలని ఆన్చింది. అతనామె పెదవుల్ని మెల్లగా మెత్తగా ముద్దుపెట్టుకున్నాడు. ఇద్దరూ ఒకరి పక్కగా ఒకరు ఒరిగి పడుకున్నారు.

"రేపు ఆఫీసరు వస్తాడు పరీక్ష చేసేందుకు" అన్నాడతను.

"ఉహూ" అందామె.

"ఇక్కడ బావుంది కదూ-పీడకలలు వచ్చే నిద్రకన్నా ?" అన్నాడతను. అతను తిరిగి జేబులోనికి చెయ్యి పోనిచ్చి తీసివేశాడు.

"ఎందుకు యిందాకట్నుంచి జేబు తడుముకుంటున్నారు !" అంది ఆమె అతని జుట్టులోకి వేళ్ళని పోనిస్తూ.

అతను నవ్వాడు "సిగరెట్లకోసం - లేవన్నమాట మరచి పోతుంటాను "

మధ్య మధ్య ఏవో అస్పష్ట రవాలు దూరంగా దేరాలనుంచి వినవస్తున్నాయి. కృష్ణపక్షపు గుడ్డివెన్నెలలో ఆ నగరం తనలో తానొదిగిన పెద్ద తాబేలులా వుంది